# విముక్తి

పదేళ్ళ పాప. ఎవరా పాప. తనలాగే వుంది. తనేనా! హాయిగా ఆదమరచి నిద్రపోతోందా పాప. తెల్లటి దుప్పటి. తెల్లని పావడా. తెల్లని అంచు. ఎర్రని జాకెట్టు. తలంటి పోసుకుని వదిలేసిన జుట్టు నల్లగా పాములా తెల్లటి దుప్పటి మీద పడి వుంది.ఆ పాప ఈ లోకంలో లేదు. పెదవుల మీద చిరునవ్వు చూస్తుంటే యేవో దేవ లోకపు కలలు కంటున్నట్టుగా వుంది. నెమ్మదిగా పెదవుల మీద చిరునవ్వు ఆగిపోయింది. పెదవులు ముడుచుకున్నాయి. ఏదో యిబ్బంది. కలల్లోంచి, నిద్రలోంచి ఈ లోకంలోకీ, తెలివిలోకీ వచ్చి పడుతోంది. ఆ పడటంతో పాటు మీద యేదో బరువు పడుతున్న స్పృహ. ఏదో జంతువు మీద పడినట్టు భయం, జలదరింపు. కళ్ళు విప్పితే ముందు చీకటి, తర్వాత కళ్ళు చీల్చుకు చూస్తే తన మీద బరువు - జంతువు కాదు, మనిషి, తనని అదుముతూ, తనను కొరుకుతూ, చీలుస్తూ, తను అరవబోయింది., కానీ వీల్లేదు. గొంతు అణిగిపోతోంది. ఎక్కడికో పడిపోతోంది. పైకి రావాలని చేస్తున్న ప్రయత్నం పెనుగులాటలను దాటుకుని వేగంగా పాతాళంలోకి పోతోంది. తననెవరో చంపేస్తున్నారు. రాక్షసుడంటే యితనేనా?

"అమ్మో-"

తన కేకకు తనకే మెలకువ వచ్చింది ఇందిరకు. ఒళ్ళంతా చెమటతో తడిసింది. కళ్ళ వెంట నీళ్ళు -

పాతికేళ్ళుగా యిట్లా అరుస్తూ, యేడుస్తూ నిద్ర లేవటం అలవాటయింది ఇందిరకు.

"పదేళ్ళ వయసులోని ఆ పీడకల పెరిగి, పెద్దై, డాక్టరయినా తనను విడవలేదు. భల్లూకంలా తనను పట్టుకునే వుంది". ఇందిర లేచి గడియారం చూసింది. తెల్లవారు ఝామున నాలుగు గంటలు. ఇక నిద్రరాదు. అనవసరం కూడా -

గదిలోంచి బాల్కనీలోకి వచ్చింది. చల్లటి గాలి ఒంటి చెమటకు తగలగానే యెంతో హాయిగా ఆత్మీయులెవరో స్పర్శించి పరామర్శించి, సేదదీర్చినట్లుగా వుంది. అమ్మ చనిపోయిన తర్వాత గాలీ, నీరూ తప్ప తననిలా పరామర్శించే వాళ్ళెవరూ లేరు.

అమ్మా-అమ్మ అని రెండు సార్లు మనసులో అనుకుని అది సరిపోనట్లు "అమ్మా' ' అని పెద్దగా పిలిచింది. అమ్మ-తన కోసం అందర్నీ అన్నిటినీ ఒదిలి వచ్చింది. పదేళ్ళపాటు ప్రతి క్షణం తన కోసమే బతికింది. అందరూ తననో సమస్యగా అసహనంగా చూస్తున్న క్షణాలలో అమ్మ ధైర్యంగా తన పక్క నిలబడకపోతే తనేమయ్యేది. ఇందిర యెంత వద్దనుకున్నా గతం వదలకుండా వచ్చి మీదికి దూకుతుంది.

కొన్ని గంటలలా గడిపాక గానీ తెల్లవారలేదు. ఇందిరకు తెల్లవారితే యెంతో బాగుంటుంది. యెన్నో పనులు, పనులు తొందరగా ముగించుకుని ఆస్పత్రికి పోవాలి.

ఆస్పత్రికి వెళ్ళటం కూడా భయంగానే వుంటోంది. ఆస్పత్రిలో అంతా బాగానే వుంటుంది. రోగుల్ని పరీక్షించటం, వాళ్ళ బాధ తగ్గించటానికి మందులివ్వటం అన్నీ బాగుంటాయి. ప్రసవ వేదన పడే తల్లుల కష్టాన్ని తీసేసి ఈ లోకంలోకి తొంగి చూస్తున్న పాపాయిల తొలి కేకలు వినటం యింకా చాలా బాగుంటుంది. రాత్రీ, పగలూ ఆ పని చేయటంలో విసుగనేదే లేదు. కానీ ఆ చిన్న పిల్లలు - వాళ్ళను తను చూడలేకపోతోంది.

ఆ అమ్మాయిలు, మూడేళ్ళ నుంచీ పదిహేనేళ్ళ వరకూ యెంత వయసున్నా వుండొచ్చు. బాధతో స్పృహ వుండీ, లేకా వస్తారు.

ఒళ్ళంతా రక్కిన ముళ్ళు గుచ్చుకున్నట్లు గాయాలతో వస్తారు. ఆ చిన్న చిన్న ఆడ పిల్లలు. వాళ్ళను చూస్తుంటే తనకు భయం, బాధ, జాలి, దయ, ప్రేమ అన్నీ కమ్ము కొస్తాయి. వాళ్ళకంతా నయం చేస్తుంది. వాళ్ళను గుండెలకు హత్తుకుని వాళ్ళ జుట్టు నిమిరి పంపిస్తుంది. రక్తం ఆగుతుంది. చినిగిన చర్మం కలిపి కుడితే అతుక్కుంటుంది. గాయమూ మానుతుంది. నొప్పి తగ్గి ఆ ప్రదేశమూ మామూలవుతుంది.

కానీ ఆ పాపల మనసుల గురించి తన భయం, మహావిషాద భరితమైన వారి కళ్ళలోంచి, అర్థ విహీనమైన చూపుల గుండా వాళ్ళ మనసులు చదవాలనీ -

అక్కడి గాయాల లోతుని అర్థం చేసుకోవాలనీ, వాటిని తన గాయంతో పోల్చి చూసుకోవాలనీ, వాటి మీద చలచల్లని మందు రాసి అంతా మళ్ళీ మామూలు చేయాలనీ వుంటుంది.

పై గాయం మానాక వాళ్ళు వెళ్ళిపోతారు. మళ్ళీ యిళ్ళ లోకి, పొలాల్లోకీ, హాస్టళ్ళలోకీ తమను బంధించి చీల్చే రాక్షస గృహాల్లోకి మళ్ళీ వెళ్ళిపోతారు. అక్కడ యేం జరుగుతుందో తనకు బాగా తెలుసు. ఇవాళ అంతా సజావుగా గడిచిపోవాలనుకుంటూ ఆస్పత్రికి బయల్దేరింది ఇందిర.

నిన్నటి కేసు మనసుని మెలిదిప్పి వదిలింది. పీడ కలల్తో నిద్ర లేని రాత్రి, కళ్ళు మూసుకుంటే ఆ పసి కూనలు. రక్తాలు కారుతూ, ఒకోసారి పిచ్చెక్కుతుందేమో అనిపిస్తుంది.

ఈ ప్రభుత్వాసుపత్రిలో వుద్యోగం ఒదిలేద్దామనిపిస్తుంది. ఆ బీద ఆడ పిల్లల్ని హాస్టళ్ళ నుంచి తీసుకుని యెక్కడి కన్నా పోయి వాళ్ళు హాయిగా, ఆనందంగా పెరిగేలా చూసుకుంటే -

కానీ ఆ హాస్టళ్ళలో యింకా చేరతారు. అక్కడేనా? పల్లెల నిండా వున్నారు ఆడ పిల్లలు. వాళ్ళు బర్రెలు, గొర్రెలు కాయటానికి వెళ్తారు. పొలం పనులకు వెళ్తారు. దొడ్డికి పోతారు. ఎవరు రక్షిస్తారు వాళ్ళను?

చిన్న చిన్న పాపలు. ఎలక పళ్ళతో, బోసి నోళ్ళతో, చిట్టి చేతుల్తో - తమ మీద పడుతున్న మృగాల్ని కొరకనన్నా కొరకలేని, కొట్టనన్నా కొట్టలేని అమాయకపు కూనలు, ఎక్కడ చూసినా వాళ్ళే కన్పడతారు.

ఇల్లు దాటి బైటికొస్తే అరటిపళ్ళు చిన్న బల్ల మీద పెట్టుకుని కూచున్న చిన్న పిల్ల సంతోషమ్మ, నిజంగా సంతోషమ్మే. ఎర్రటి చిగుళ్ళు కన్పడేలా నవ్వుతూ వుంటుంది.

రోజా ఇంటికెళ్ళేప్పుడు ఆ పిల్ల దగ్గర అరటి పళ్ళు కొనాల్సిందే. లేకపోతే తనను కదలనివ్వదు.

రైలు కట్ట దగ్గర మొక్కజొన్న కండెలు కాలుస్తూ కూచునే మార్తమ్మ కండెల సీజన్ అవగానే సీతాఫలాలు, జామ కాయలూ, మామిడి కాయలూ అమ్ముతుంది. సంవత్సరంన్నర నుంచీ ఆ పిల్లను రైలు కట్ట దగ్గర చూడటం అలవాటయింది. రైలు కట్టమ్మట యెప్పుడూ తిరుగుతూనే వుంటారు పిల్లలు.

రోడ్ల వెంట నడుస్తూ, ఆడుతూ, నవ్వుతూ, యేడుస్తూ., అమ్మల వెనక మారాం చేస్తూ పోతూ -

అంట్ల గిన్నెలు తోమి చద్దన్నం యిళ్ళకు పట్టుకుపోతూ, కలవారి యిళ్ళల్లో పూసిన గులాబీలనూ, చేమంతులనూ గేట్ల ముందు నిల్చుని కళ్ళు విప్పార్చి చూస్తూ.

బజార్లలో ఆడుకునే క్రికెట్టునో, మరో ఆటనో మంత్రముగ్ధులై చూస్తూ -

ఆడుకుంటూ, అడుక్కుంటూ ఎక్కడ చూసినా ఈ పిచ్చి పిల్లలే - ఈ ఆడపిల్లలే.

ఈ ఆడపిల్లలందర్నీ పోగేసుకుని యెక్కడికన్నా మాయమై వాళ్ళ మీద హింస జరగనిచోట వాలాలనిపిస్తుంది. ఏ ఆడపిల్లను చూసినా జాలి, యిష్టం, ప్రేమ, దుఃఖం అన్నీ కలగలసి యిక ఆ పిల్ల వెంటపడి పోవాలనిపిస్తుంది

ఆ పిల్లకు యే ఆపదా, యే అపాయం కలగకుండా రక్షించాలనిపిస్తుంది.

రాను, రానూ హాస్పిటల్‌కు వెళ్ళాలంటేనే భయంగా వుంది. రెండు, మూడు నెలలకొకసారి వచ్చే కేసులు వారానికి రెండు, మూడు వస్తున్నాయి.

రోజా ఆ పిల్లలతో పాటు చచ్చి బతుకుతోంది.

ఉద్యోగం మానలేదు. తను మానేస్తే వచ్చే డాక్టరు సరిగా చూడకపోతే - కసురుకుంటే

మందులు వేసుకోలేదనో, గాయం రేపుకున్నారనో, తిండి తినలేదనో కసురుకుంటే, తిడితే -

అమ్మో తను భరించలేదు. అంత దెబ్బతిన్న ఆ పిల్లల్ని సున్నితంగా చూసుకోవాలి. అమ్మ తనను చూసుకున్నట్లు.

తనో సాలెగూడులో చిక్కుకున్నట్లనిపిస్తుంది. ఆ సాలీడు చిన్న చిన్న తూనిగల్ని కరుస్తుంది. అవొచ్చి తన ముందు గిలగిలలాడుతూ పడిపోతాయి. తను వాటిని చూడలేదు. కానీ బైటపడే మార్గం లేదు. ఆ దెబ్బ పెట్టే బాధ, సలపరింత తనకు బాగా తెలుసు.

దేవుడా నువ్వంటూ వుంటే ఆడపిల్లల్ని పుట్టించకు తండ్రీ, తక్కువ కులాల్లో అసలు పుట్టించకు.

నువ్వు వుండే వుంటావు. నువ్వు మగాడివి. పెద్ద కులం వాడివి. అందుకే ఆడపిల్లల్ని యిట్లా చెండుకు తింటున్నావు. ఇందిరకు తనకు పిచ్చెక్కుతుందోమోనని ఒకసారి భయం వేస్తుంది. తనకు పిచ్చెక్కితే ఈ పిచ్చి పిల్లల్నెవరు చూస్తారు? కానీ ఈ ఒక్కచోట తను, దేశమంతా, ప్రపంచమంతా వున్నారు పిల్లలు.

అబ్బా-తనెక్కువ ఆలోచిస్తోంది. పిల్లలందరూ హాయిగా వున్నారు. ఆనందంగా వున్నారు. సురక్షితంగా వున్నారు. ఈ ప్రపంచం మంచిది. ఈ మనుషులు మంచివాళ్ళు. ఎక్కడ పసిపాపలు కన్పించినా యెత్తుకుని, ముద్దు చేసి వాళ్ళను ప్రేమగా చూస్తారు. వాళ్ళ జ్వరాలు, పుళ్ళూ నయం చేసి పంపుతారు. వాళ్ళకు చదువు నేర్పి పెద్దవాళ్ళను చేస్తారు. అందుకే యిన్ని పార్కులు. బళ్ళు, ఆస్పత్రులు, పిల్లలకు కావల్సినవన్నీ యిస్తారు మనుషులు. తనూరికే భయపడుతోంది. ఈ ప్రపంచం మంచిది. ఈ మనుషులు పుణ్యాత్ములు. ఈ పసిపాపలు దేవదూతలు. వీళ్ళని కష్టపెడతారా యెవరైనా.

ఇది మరీ అతిగా వుందా? పోనీ మంచీ, చెడ్డా రెండూ వుంటాయి లోకంలో, మంచిని పెంచి చెడుని తొలిగించటం మానవుల పని. తను ఆ పనే చేస్తోంది. దానికింత తలబద్దలు కొట్టుకోవటం యెందుకు?

అమ్మయ్య - అంతా ప్రశాంతంగా వుంది.

ఆస్పత్రి కూడా -

ఎమర్జెన్సీలు లేవు. యాక్సిడెంట్లు లేవు. పరమ ప్రశాంతం. ఇందిర ఆస్పత్రికి చేరి తన గదిలోకి వెళ్ళింది. నర్సు చకచకా పనిచేస్తోంది.

"వచ్చారా?" అంది ఇందిరను చూడగానే.

"ఇంటికి ఫోన్‌చేస్తే బయల్దేరారని చెప్పారు" అంది.

"డెలివరీ కేసు వుందా?"

"లేదు. ఆ అమ్మాయి రాత్రి కనేసింది" నర్సు నవ్వింది.

"మరి-" ఇందిర గుండె గుబగుబలాడింది.

"మామూలే - ఆ హాస్టల్లో పిల్ల తెల్లారగట్ట దొడ్డికి పోయిందంట?"

వాణీ ఓ పక్క గడ్డ కడుతూనే మరో పక్క చురుగ్గా కదిలింది.

థియేటర్ సమీపంలోకి వస్తునే సన్నని మూలుగు.

అదొక రకం మూలుగు. ఆ మూలుగు అంటేనే భయం.

ఎప్పటికీ యిట్లాంటి మూలుగు వినకూడదని రోజూ వెతుక్కుంటుంది.

తూనీగలవీ, సీతాకోక చిలుకలవీ రెక్కలు విరిచేస్తే అవి యిలాగే మూలుగుతాయి.

పక్షి గూటిలో చేయి పెడితే అపుడే గుడ్డు చించుకు బైట పడిన పిట్ట పిల్లలిలాగే మూలుగుతాయి.

పరమ నిస్సహాయంగా - లోకంలో చీకటి తప్ప మరొకటి లేదన్నంత భయంగా, పిరికిగా.

ఇంకాస్త దగ్గరకు వెళ్తే వాసన. రక్తం -

ఎండిన రక్తం, తాజా రక్తం, మూత్రం, చెమట, వీర్యం, అన్ని కలిసిన వాసన.

రాక్షసపు వాసన, నరమాంస భక్షకులు వొదిలిన వాసన.

ఆ గోడకు తల పగలకొట్టుకోవాలనిపిస్తుంది.

మెల్లిగా ఆ పిల్ల తల నిమిరింది.

భయంతో జీవం కోల్పోయిన కళ్ళెత్తి చూసిందా పిల్ల. ఆ కళ్ళలో యేమీ లేదు. కోపం, పగ, ప్రతీకారం, బాధ, దుఃఖం యేమీ లేవు.

వలలో చిక్కిన లేడిపిల్ల యిట్లాగే చూస్తుందా? ఆ నిర్వికారపు చూపుల్నెలా యెదుర్కోవటం?

ఆ కళ్ళల్లో కళ్ళు కలిపి జీవం రప్పించగల్గిన వారెవరు? శుభ్రం చేస్తోంది గాయాన్ని. కదలటంలేదా పాప. నొప్పి తెలియని ఇంజక్షన్ చేయకుండానే మొద్దుబారిందా పాప. చైతన్యం తెచ్చే వారెవరు? గాయాన్ని తుడిచి కుట్టు వేస్తోంది.

కుట్లు వేసి మళ్ళీ అంతా శుభ్రం చేసింది.

అంతకు ముందువరకూ యుద్ధభూమిలా వున్న యోని ప్రాంతం మళ్ళీ మృదువుగా, దయగా, శాంతిసీమలా మారింది.

ఈ చిన్నిచోటు మీద యెందుకింత దాడి.

దురాక్రమణలు, యుద్ధ భేరీలూ, బీభత్సం చేసి రక్తసిక్తంగా వొదిలే కిరాతక చర్యలు.

ఎందుకీ పగ? ఎప్పుడు? ఎందుకు? ఏర్పడిందా పగ? పాముల్ని బతకనీయని అగ్ని దేవుడి పగ కంటే పరిక్షిత్తుడ్ని బతకనీయని పాము పగ కంటే -

దానవుల నాశనం చూడాలనుకున్న దేవతల పగ కంటే - తీవ్రమైన పగ. పురాతనమైన పగ.

ఎట్లా యెవరు చల్లారుస్తారీ పగను. ఎవరు రక్షిస్తారీ పసి కూనలను.

గ్లోవ్స్ తీసేసి ఆ పాప చేయి పట్టుకుంది.

"ఏం పేరు?" అంది.

"వెంకట లక్ష్మి" నర్సు అన్నీ సర్దేస్తోంది.

"అమ్మా, నాన్న వొచ్చారా?"

"లేరంట" అతి మామూలుగా చెప్పిన మాట. ఇందిరలో ఆదుర్దా కలిగించింది.

నర్సు వివరాలు చెప్తోంది రొటీన్‌గా డెలవరీ కేసు వివరాలు చెప్పినట్టే.

"చచ్చిపోయారు. చిన్నాన్న దగ్గరుండేది. అతను హాస్టల్లో చేర్పించి వుద్యోగం మీద పొయ్యాడు."

"ఇపుడెవరొచ్చారు?"

"హాస్టలు వార్డెన్. వెళ్ళిపోయాడు. సాయంత్రం వస్తానన్నాడు."

ఇందిరకు యింకో కేసు వచ్చింది.

మూడు గంటల వరకూ తీరికలేని పని, జబ్బులు, కాన్పులు, రక్త పరీక్షలు, రక్తపోట్లు, మందులు -

అన్నీ అయ్యాక ఆకలి వేస్తుంటే ఆ పాప గుర్తొచ్చింది. వార్డులో యేడుస్తూ వుందా పాప.

"యేడవకు లక్ష్మీ. నొప్పి తగ్గిపోతుంది."

ఆ పిల్ల కళ్ళు తుడుచుకుని భయంగా డాక్టరు వంక చూసింది.

"నీకెన్నేళ్ళు" పక్కనున్న స్టూలు మీద కూర్చుంది.

"పదేళ్ళు."

"తగ్గిపోతుంది. భయం లేదు" తన మాటల మీద తనకు నమ్మకం లేనట్లు చెప్పింది.

"నాకు భయం లేదు. అలవాటే. కానీ యేడుపొస్తే ఆపు కోలేను" ఆ పిల్ల యేడుస్తోంది.

ఇందిరకు పిచ్చెక్కినట్లయింది. అలవాటే అన్న మాటను యెవరో గోడకు మేకు కొట్టినట్టు తల్లో కొడుతున్నారు. ఆ మాటకు అర్థం అడిగి కనుక్కోవాలని ఒకవైపు, ఆ మాట వినపడనట్లు దాన్ని తుడిచేసి అక్కడ్నించి వెళ్ళిపోవాలని మరో వైపూ - మొదటిదే జయించింది.

"అలవాటేమిటి? అలవాటు?"

జవాబు చెప్పని పాపను కుదిపి కుదిపి మళ్ళీ మళ్ళీ అడిగింది.

"ఇదే" ఆ పాప గొంతులో కోపం వినపడితే యెంత బాగుండేది. ఒక లాంటి విసుగు. ఇందిర గుండెను నొక్కేసే విసుగు.

"ఇంతకు ముందు యెవరన్నా యిట్లా చేశారా?"

"మా చిన్నయ్య - యింకా..."

పాప నోరు మూసేసింది. కానీ ఆ పాప అరుస్తోంది ఇందిర మనసులో.

తన మీద జరిగే జరగరాని హింసను ఈ వయసులోనే అలవాటు చేసుకున్న ఆ పిల్లను చూస్తుంటే కడపులో పేగులన్నిటినీ ముద్దగా చేసి పిసుకుతున్నట్లుంది.

"తగ్గిపోయాక యేం చేస్తావు?"

ఆ పాప మాట్లాడలేదు. "ఎంత అర్థం లేని ప్రశ్న"

తను చెయ్యాలనుకున్నది చేసే స్థితిలో వుందా ఈ పిల్ల? ఇంతకుముందు తన దగ్గరకు వచ్చిన పిల్లల్లో యింత నిస్సహాయపు పిల్ల యెవరూ లేరనిపించింది.

ఆ పిల్లల తరుపున యేడవటానికో, కోపంతో తిట్టి శపించటానికో, కోర్టు కెళ్లామనటానికో తల్లో, తండ్రో, అమ్మమ్మో, అన్నయ్యో, అక్కో యెవరో వొకరుండేవారు. నేరస్తుడి మీద కేసు పెడతామనో, కాదు చితకతందామనో ఆలోచనలు చేసేవారు. ఈ పిల్లకు యెవరూ లేరు. వెళ్ళిన వారం రోజుల్లో మళ్ళీ దాడి జరగొచ్చు.

ఇదంతా యిట్లా జరగకుండా వుండొచ్చనీ, ఈ రాక్షసపు టెండలో కాకుండా చల్లని నీడలో చాలామంది పిల్లలు బతుకుతున్నారనీ తెలుసా ఈ పిల్లకు?

కలలు కన్నదా యెన్నడైనా ఆ నీడ గురించి?

అక్కడ్నించి కదలాలనిపించలేదు ఇందిరకు. బలవంతంగా కదిలింది.

వారంలో ఆ పిల్ల గాయం మానింది. కాస్త తేరుకుంది.

హాస్పిటల్‌లో చేర్చి వెళ్ళిన వార్డెన్ ఒకసారొచ్చి చూసి వెళ్ళాడు.

ఒక్కతే బయల్దేరుతున్న ఆ పిల్లను చూస్తుంటే ఇందిర గుండె పట్టేసింది.

ఎంత బలం కావాలి అలా ఒంటరిగా ప్రయాణమవటానికి?

ఇంత చిన్న పావురం మీద యెంత బరువు?

ఆ పావురాన్ని తన గుండెల్లో పొదువుకుంటూ అన్నది, "హాస్టల్‌కి యింకాస్త బలం వచ్చాక వెళ్దువు గానీ?"

వెంకటలక్ష్మి, నర్సు అర్థం కానట్టు చూశారు.

"మా యింటికి వెళ్దాం ఒక వారం తర్వాత వెళ్దువు గానీ."

నర్సు చిత్రంగా, అయిష్టంగా చూసింది.

"మీకెందుకీ తగలాటకం" అంది అసహనాన్ని కంట్రోలు చేసుకుంటూ.

"ఫరవాలేదులే. పాపం చిన్నపిల్ల, బలహీనంగా వుంది. ఆ హాస్టల్లో యేముంటుంది. ఒక వారం మా యింట్లో వుండి వెళ్తుంది. వార్డెన్‌కు కబురు పంపుదాం."

"ఎంత మందిని తీసుకెళ్ళగలుగుతారు?" నిరసనగా అంది నర్సు. మధ్య తరగతిని రక్షించే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం అనవసరం.

సాయంత్రం ఆ పిల్ల స్నానం చేశాక, కొత్త బట్టలు యిచ్చి, తలదువ్వి రెండు జడలు వేసింది.

పాప ముఖంలో చిన్న సంతోషం. కళ్ళల్లో చిన్న సంబరం. "ఈ కళ్ళల్లోకి యికనైనా కలలు ప్రవహిస్తే బాగుండు" అనుకుంది ఇందిర.

ఈ చిన్న పిల్ల ఇందిరకు జీవితం మీద యెన్నడూ లేనంత ఆసక్తిని కలిగించింది. రోజులూ, వారాలు గడుస్తున్నాయి. హాస్టలు గడువు దాటిపోయింది. వెంకటలక్ష్మి పకపకా నవ్వుతోంది. మర్చిపోతోంది గాయాల్ని.

ఈ ఒక్క పాప చాలు తనకు తోడుగా -

మళ్ళీ వచ్చాయి కేసులు. ఆర్తితో వాళ్ళకు సేవ చేసింది. నయం చేసింది. ఇళ్ళకు పంపింది.

ఇంట్లోని ఈ వెంకటలక్ష్మి యెంతో ధైర్యాన్నిస్తోంది. మబ్బులా మనసుని కమ్మే విషాదం యిప్పుడు లేదు. అందరి గురించి వుపయోగం లేని ఆందోళన లేదు.

ఈ పిల్లల్ని యెవరో వొకరు ఆదుకుంటారు. ఎవరో ఒకరు వీళ్ళ కోసం ఈ ప్రపంచంలో వుంటారు అనిపిస్తోంది. నెల దాటుతోంది వెంకటలక్ష్మి వచ్చి. ఆ పిల్ల తెల్లని కన్నుల్లో నల్లని కనుపాపలు యెంతో కాంతిని వెదజల్లుతున్నాయి.

"కల యేదైనా వచ్చిందా పాపా" ఇందిర అడిగింది. వెంకట లక్ష్మి ముఖం కాంతి హీనమైంది.

'ఎందుకట్లా - పీడకల వచ్చిందేమో?'

ఆ ప్రశ్న అంత తొందరగా అడిగినందుకు పశ్చాత్తాపపడింది ఇందిర. ఇప్పటికీ పీడకలలతో నిద్ర మేల్కొనే తను యెందుకంత తొందర పడింది?

వెంకటలక్ష్మి సామాన్యంగా ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పకుండా వుండదు.

"మా చిన్నయ్య కల్లోకి వచ్చాడు."

ఇందిర పాపను దగ్గరకు తీసుకుంది భయపడవద్దంటూ, మర్నాడు వెంకటలక్ష్మి చిన్నాన్న నిజంగానే నడిచి వచ్చాడు. హాస్పిటల్‌కి. తర్వాత ఇందిర ఇంటికి.

ఆరోగ్యంగా, అందంగా వున్న పాపను చూడగానే అతని కళ్ళు మెరిశాయి. ఆ మెరుపు చూడలేక ఇందిర కళ్ళు మూసుకుంది.

ఆ మెరుపులో దాక్కుని వున్న మంట భీకరంగా నాల్క సాచింది.

వెంకటలక్ష్మిని తీసుకెళ్తానన్నాడు.

ఇందిర వెంకటలక్ష్మిని పెంచుకుంటానంది. చదివిస్తానంది. "మా పిల్ల. నేను తీసుకుపోతా, మధ్యలో నువ్వెవరు?" అని అతనంటున్న మాటలకు కడుపు రగిలిపోతోంది. నయానా, భయానా చెప్పి చూసింది.

అతను పట్టు వొదల్లేదు. పక్క టౌన్లో మెకానిక్ షెడ్డు పెట్టుకున్నాడట. పెళ్ళి చేసుకున్నాడట.

"నా కూతుర్ని నే చదివించుకుంటా లెండి" అన్నాడు.

కానీ మరి ఆ పనెందుకు చేశావు? అని అడగలేకపోయింది. అడిగితే పాపకు ప్రమాదమేమో అన్పించింది.

వెంకటలక్ష్మి యేమీ చెప్పదు. బదులు చెప్పకుండా వుండలేని పిల్ల పెదవి విప్పటం

లేదంటే అర్థమేమిటో తెలుస్తూనే వుంది.

వెంకటలక్ష్మి వెళ్ళిపోయింది మేకపిల్లలా.

ఇందిరకు మళ్ళీ భూతంలా దిగులు వచ్చి మీద పడింది. మళ్ళీ భయం, దుఃఖం, పిరికితనం, నిస్సహాయత -

కల్లోల సముద్రం లాంటి కాలాన్ని ఈదుతున్నంత కష్టంగా గడుస్తున్నాయి రోజులు.

పదినెల్లు అట్లా గడిచిపోయాయి.

ఇందిరకు లోపలి గాయం యెప్పుడూ రేగుతూ వుండటం కూడా అలవాటయి పోయింది. ఇరవై అయిదేళ్ళుగా ఆ గాయం అట్లా నిరంతరం రక్తం స్రవించటాన్ని అలవాటుగా చేసుకోవటానికి పడాల్సిన చిత్రహింస అంతా ఇందిర పడుతూనే వుంది.

ఒకనాటి ఉదయం కష్టమైన కాన్పు చేసి చిన్న శిశువును తల్లి చేతులకందించిన సంతృప్తి ముఖమంతా నిండగా తన గదిలోకి వచ్చి కూర్చుంది ఇందిర.

ఇట్లాంటి సమయంలో ప్రపంచం మీద యెంతో ప్రేమ. తనమీద తనకెంతో ప్రేమ. అవధులు లేని ఆనంద సముద్రాన్ని తన్మయమై అనుభూతి చెందుతుంది. అన్ని కష్టాలనూ ఈ ఆనందం యిచ్చే బలంతో జయంచ వచ్చుననిపిస్తుంది యిట్లాంటపుడు.

"డాక్టర్ - వెంకటలక్ష్మి వచ్చింది చూశారా. భయంకరం. వాళ్ళు మనుషులు కాదు. పశువులు."

సిస్టర్ గబగబా మాట్లాడుతోంది.

ఇందిర ఒక్క ఉదుటున లేచింది.

"ఎక్కడుంది?"

"సుశీలా మేడం హాండిల్ చేస్తున్నారు. అబార్షన్ - రక్తం తెగపోతోంది. మీరు లేబర్ రూంలో వున్నపుడు తెచ్చారు. వాళ్ళ చిన్నాయనంట."

ఇందిర థియేటర్ వైపు పరిగెత్తినట్లే నడిచింది.

డాక్టర్ సుశీల చాలా కష్టపడుతోంది.

"సుశీల - నేను సాయం చెయ్యనా?"

"ఏముంది ఎవరు చెయ్యటానికైనా? ఈ పిల్ల చూడు, ఈ అవతారం చూడు. నాల్గు నెలలు నిండాయి. నాటు వైద్యం చేశారు. చాలా కష్టం. లోపలంతా ఇన్‌ఫెక్ట్ అయింది. ఇప్పుడెవరూ యేం చెయ్యలేం."

వెంకటలక్ష్మి ముఖం పాలిపోయి వుంది.

పన్నెండేళ్ళ వెంకటలక్ష్మి. పసి వెంకటలక్ష్మి.

పీడకలలు మర్చిపోవటానికి సమయం చిక్కని -

సుందర స్వప్నాలుంటాయని తెలిసే అవకాశమే లేని - పిచ్చిపిల్ల వెంకటలక్ష్మి.

నాడి చూసిన ఇందిరకు అర్థమైపోయింది.

విముక్తి - వెంకటలక్ష్మికి విముక్తి తప్పదు.

చిన్నాయననుండీ, వార్డెన్ల నుండీ, దొడ్డికి పోయే చోటా, పనులు చేసే చోటా, కాపుకాసే పెద్ద పులుల పంజాల నుండీ విముక్తి.

శరీరాన్ని ఛిద్రం చేసి మనసుని గడ్డ కట్టించే భయంకర అనుభవాల నుంచి విముక్తి.

ఇందిర మెల్లిగా, సవ్వడి చేయకుండా -

తన గొంతులో బిగపట్టిన దుఃఖం వల్లా, తన అడుగుల చప్పుడు వల్లా, వెంకటలక్ష్మి ఆఖరి అడుగులు యెక్కడ తడబడతాయోననే జాగ్రత్తతో అతి నిదానంగా అక్కడ్నించి బైటపడింది.

*(29.10.2000, ఆదివారం ఆంధ్రజ్యోతి)*